


# అన్నదాత

వరదలో కొట్టుకుపోయేవాడు - ప్రాణరక్షణార్థం - విచక్షణారహితంగా-పాముతోనైనా పట్టుకోగలడు. కూతవేటు దూరంలో - తన కభిముఖంగా నడిచివస్తోన్న ఒక అప్పులవాణ్ణి చూచీ చూడగానే-ప్రక్క-వీధిలోకి మళ్ళేడు సూర్యం. ఆ వీధిలో అలా భీతహరిణంలా కొంతదూరం నడిచాక— ముందడుగుల్లో తానెదుర్కో-వలసిన అవాంతరం మరొకటున్నదన్న విషయం హఠాత్తుగా స్ఫురించిందతనికి. అయినా ఆ రెండు మార్గాల్లో ఏదో ఒకదారిని బడి వెళ్ళకతప్పదు. ఉదరపోషణార్థం ఉదయం ఏడున్నర గంటలకల్లా తానుపని జేసే చోటికి చేరుకోవాలి.

ఆ వీధిచివర-మలుపులో - 'అన్నపూర్ణా కేఫ్' వుంది. అన్నపూర్ణా కేఫ్ - దగ్గరబడగానే అతని నడకవేగం హెచ్చింది. కాని - అది అతని అదృష్టమేమో - శరణార్థికి అభయ హస్తంలా ఆ ఫలహారశాల మూయబడి వుంది. ఈ సంగతి ఓరకంట గుర్తించిన సూర్యం కుదుటబడిన మన

ష్నుతో మలుపుతిరిగాడు. అయినా - ఆ హోటలు యజ మాని-ఏ క్షణంలో-ఏ తెర చాటునుంచీ అయాచిత దర్శ నంతో కళ్లు మిరుమిట్లు గొల్పుతాడోనన్న అనుమానం మాత్రం అతని మనస్సును వీడిపోలేదు.

'సైన్‌బోర్డు'ను శిరోభూషణంగా ధరించిన ఆ హోటలు బ్రతికి చెడ్డవాడిలా లజ్జపడుతోంది. ఆ వేళ - హోటలుకు సెలవుదినమూ కాదు; ఊళ్ళో హర్తాళేదైనా జరుగుతోందా-లేదు; హోటలు పనివాళ్లు సమ్మెగానీ చేస్తు న్నారా అంటే-అంతమంది పనివాళ్లను పెట్టుకోగల ఆడంబ రానికి అది నోచుకోలేదు. మానం కాచుకోడానికి - గోచి కట్టు, పైగుడ్డ చాలునన్న గాంధీ మహాత్ముని లోని నిరాడం బరత ఆ హోటలు నిర్వహణంలో కనిపిస్తుంది. ఇవేవీ కార ణాలు కాకపోయినా సుముహూర్తంలో దురంతంలా - ఆ హోటలు - తెరచివుంచ బడవలసినరోజున తలుపులు బిగింపబడివుంది. ఈ నెలనాళ్లల్లో - పొరబాటుననో, విధి లేకనో తానాదారిన వెళ్ళిన ఏ కొద్దిసార్లలోనూ - ఒక్క సారైనా ఆ హోటలు తెరచివుండగా తాను చూచినట్లు సూర్యానికి గుర్తులేదు.

మలుపుదిరిగిన సూర్యం నాలుగడుగులైనా వేయ కుండానే-అతనికొక వింత కనిపించింది. ఒక పెద్ద గుంపు—ఒకచోట కనిపించగా కలిగే వింతకన్న గొప్పవింత మరే ముంటుంది-సామాన్యుడికి?

అది-అన్నపూర్ణాకేఫ్ వెనుక శిథిల విభాగం. గుం డేలు జారనీక-కాలాన్ని ఎదురీదే మొండివాడిలా - పైకప్పు లను కూలిపోనీయక - తమ శిథిలదేహాలపై మోస్తూన్న మొండిగోడలు.

అది 'లక్ష్మీనివాసం' కాదు. అలా అయితే - విశ్వ నాథం అందులో నివాసం వుండేవాడు కాదు—అక్కడ ఒక పెద్ద గుంపు! ఆ గుంపులో—ఆశ్చర్యం, భీభత్సం భయాన కం, కరుణ, విషాదం మొదలైన వివిధరసాలు రంగు రంగుల సీతాకోకచిలుకల్లా రెక్కలు విప్పి విహారం చేస్తూన్నాయి.

సూర్యం ఆ గుంపులో భాగస్వామి కాలేదు. సాలె గూటిలో చిక్కుపడ దలచుకోలేదు. విశ్వనాథుని సాన్ని ధ్యం అతనికి అపాయకరం.

ఆ గుంపుకు దవ్వున నిలబడి, తనకు దాపుగా ఉన్న ఓ మనిషిని "ఆ గుంపేమిటి?" అని అడిగాడు.

చావుకబురు చెప్పాడామనిషి. ముఖంలో వికారం, కంఠంలో ఉత్కంఠ బహిర్గతంకాగా "చచ్చిన మనిషెవరు!" అన్నాడు సూర్యం.

"విశ్వనాథం"

ఆశ్చర్యానికి రూపకల్పనలా, కొయ్యబారిపోయాడు సూర్యం. తన చెవులను నమ్మలేక "ఎవరూ?" అన్నాడు.

"విశ్వనాథం!"

అవతల మనిషినోటిని నమ్మలేక "విశ్వనాథమేనా!" అన్నాడు.

"సాక్షాత్తూ విశ్వనాథమే!"

"రామ రామ! ఆకలిచావే?" అంటున్నారెవరో.

సూర్యం గుంపుని దూసుకుని లోపలికి పోబోయి ఆగిపోయాడు. ఒకానొక భయం—శవాన్ని చూడాలన్న కోరికను మ్రింగివేసింది.

తాను దగ్గరికి వెళ్ళగానే విశ్వనాథంశవం భయంకరంగా నవ్వుతుంది. కట్టెలా పైకి లేస్తుంది. ఇనుప సంకెళ్ళ వంటి చేతులతో తనగొంతు పట్టుకుంటుంది. "నాచావుకు కారణం నువ్వే, నన్ను చంపింది నువ్వే?" అంటూ ఆక్రోశిస్తుంది...

సూర్యం శరీరం జలదరించింది, అతడు అక్కడుంటానికి భయపడి ముందుకు సాగిపోయాడు. నిద్రవంటి మైమరపు అతన్ని ఆవహించింది. రోడ్డు, మనుష్యులు గమ్యం—ఏదీ కనిపించడం లేదతనికి. అతని ఆలోచనలన్నీ ఒకే విషయం మీాదికి కేంద్రీకరింపబడ్డాయి.

విశ్వనాథం జీవితంలో-చరమాధ్యాయం ఆదిలోనే అంతాన్ని చొప్పించుకొని యింత హఠాత్తుగా తారసిల్లుతుందని ఎవరనుకోగలరు?

ఇంతా ముప్ఫై అయిదేళ్ళు నిండని విశ్వనాథం, అను భవింపబోయే తీయని జీవితాన్ని ఉట్టిగట్టి పెట్టుకొన్న విశ్వనాథం, ధనాన్ని రెండు చేతులతో ఆర్జించ వలసిన విశ్వనాథం తన ఆశలకు, ఆశయాలకు, తుదకు తన బ్రతుకుకే తిలోదకాలిచ్చుకొనవలసి వస్తుందని ఎప్పుడైనా వూహించు కొన్నాడా?

జీవితానికి ఏదో ఒక ఆరాధన, ఆశయం వుంటుంది. అది లేకపోతే జీవితాశే లేదు.

ఎన్నికల్లో ఓడిపోయి మళ్ళీ మళ్ళీ పాల్గొనే రాజకీయ పిపాసులు, పరీక్షతప్పి మళ్ళీ—ఆ పరీక్షలో ఉత్తీర్ణ లయ్యేవరకు గానీ పుస్తకాలను విడనాడని విద్యార్థులు మన ఎరుకలోని వారే. వారి లక్ష్య సిద్ధికి సాధనాలు ఓపిక, పట్టుదల, ప్రయత్నమూనూ.

విశ్వనాథం తన హోటల్ని నిత్యతోరణంగా వుంచుకో లేకపోయాడు. అల్లాగని అతడు నిశ్చితార్థాన్ని విడిచిపెట్టలేదు. ''కృషితోనాస్తిదుర్భిక్షం'' అన్న ఆర్యోక్తి మీాది విశ్వాసంతో శక్తి వంచనలేకుండా కృషిచేశాడు. కానైతే విధి అనుకూలించ లేదనుకోవాలి.

సూర్యం ఏకాకి. విశ్వనాథమూ ఏకాకే. సూర్యం ఆవూరికి క్రొత్తవాడు - విశ్వనాథం ఆవూరికి క్రొత్తవాడే అయినా సూర్యానికన్నా మూడు నెలలు పాతవాడు. సూర్యం జీవనోపాధికోసం వచ్చాడు. విశ్వనాథం ఆర్జన

కోసం వచ్చాడు. సూర్యానికి ఆ వూరితోను, విశ్వనాథం తోను ఈ నాటికి రెండేళ్ళ పరిచయముంది.

విశ్వనాథం చాలా మొరటువాడు. హోటలులో అతను కూర్చునే చోటుకి వెనుక ఒక ఫోటో వుండేది. విశ్వనాథం, అతని ప్రాణ ప్రదమైన హోటేలు ప్రక్కన నిలబడి వుండగా తీయబడిన ఛాయాచిత్రం అది. మొరటు దనంలో విశ్వనాథానికి, ఆ హోటేలుకు మధ్య తేడానే కనిపించదు.

కానీ అతని మనస్సు నవనీతం. ఆ విషయం సూర్యానికి తెలిసినంత బాగా మరెవ్వరికీ తెలియదు. రైలుదిగి చేత చిల్లిగవ్వలేక ఆకలితో తూలిపోతూ వూరిలో అడుగు పెట్టగానే మొట్టమొదట ఆదరంతో అన్నం పెట్టినవాడు విశ్వనాథం. బ్రతుకు తెరువుకోసం బ్రాకెట్ ఆట నేర్పించినవాడు కూడ అతనే. హోటలులో తనకు కాతాయిచ్చి భోజన సమస్య తీర్చినవాడూ అతనే!

విశ్వనాథానికి ఈ వ్యాపార కాంక్ష ఏ దుర్ముహూర్తంలో కలిగిందో కాని, అన్నపూర్ణా కేఫ్ ఎప్పుడూ నీరసంగా, నిస్తేజంగా వుండేది. ఒక్కొక్కసారి ఖాళీపాత్రల పైన ఈగలైనా ముసిరేవికావు. ఈ మధ్యకాలంలో నాలుగు సార్లు గాబోలు మూసివేయబడింది.

అడిగినవాడికి లేదనే స్వభావంకాదు విశ్వనాథానిది. అతనిది జాలిగుండె. ఆకలంటే ఏమిటో అతనికి బాగా

తెలుసు. అందుకే అతడు అడిగిన వాడికల్లా ఖాతాలిచ్చాడు. వాళ్ల ఆకలికడుపుకు అన్నం లేదనలేక పోయాడు.

అన్నపూర్ణా కేఫ్ లోనికి ఎవ్వరూ ప్రవేశించరు. చాల అసహ్యంగా వుంటుందా ప్రదేశం. ఆ భోజ్య పదార్థాలను చూస్తే డోకు వచ్చినా రావొచ్చు. నల్లగా పొగచూరిన గోడలు, బెంచీలమీద పేరుకొన్నదుమ్ము, ఎంగిళ్ళమీద ఝుమ్మంటూ ముసిరే ఈగల గుంపులు, నల్లటి బట్టలతో ఏహ్యంగా తానే సర్వరుగా ఒక క్లీనరు-సంస్కారంవున్న మనుషులు రాకపోవడానికి యివన్నీ కారణాలు.

విశ్వనాథం పతనానికి కారణం-అతను బ్రాకెట్టు ఆడటం ఒకటి. ఖాతాదారులు-వాయిదాల పేరుతో బాకీ లివ్వక ఎగవేయుడం రెండోది.

అయినా-హోటలును నిలబెట్టుకోడానికి ప్రయత్న లోపంలేకుండా పాటుబడ్డాడు విశ్వనాథం. తన కడుపుగట్టుకొని హోటలుకు అద్దెలు చెల్లించాడు. వీలయినంతలో ప్రతిచోటా అప్పులు చేశాడు. కంటిపాపలా పెంచిన పొట్టేలును మార్గాంతరంలేక కసాయివాడికి అమ్ముకొన్నప్పుడు---అంతటి మగవాడూ బేలలా ఏడ్చాడు. ఇంతటి క్లిష్టపరిస్థితిలోనూ తన కృషి మానుకోలేదంటే—అతనికి భవిష్యత్తుమీద ఏదో ఆశ, నమ్మిక వుండివుండాలి.

పుట్టిన ప్రతివాడూ మృత్యువువాత బడక తప్పదు - అన్న విషయం అతిసహజమే. కానీ-ఆ మృత్యువు మనిషిని

ఎదుర్కొనే విధానంలో నేవుంది-విచిత్రమంతా. కాకపోతే విశ్వనాథాన్ని ఆటబొమ్మగా జేసి మృత్యువుకూడా ఏల వినోదించాలి?...ఎలుకలను బట్టుకొన్న పిల్లి, ఆ ఎలుకను ఒక్కసారిగా ఏల చంపదూ!...

సూర్యం ఒక్కసంవత్సరకాలంగా విశ్వనాథానికి పది హేను రూపాయలు బాకీ పడివున్నాడు. విశ్వనాథం చాలా సార్లు అడిగాడు. నవ్వుతూ అడిగాడు. గద్దించికూడా అడి గాడు. చివర భుజం తట్టి పంపించాడు.

గతరాత్రి ఎనిమిది గంటలవేళ-రెండో ఆటకు వెళ్దా మని-థియేటరుకు, అన్నపూర్ణా కేఫ్‌కు మధ్యనున్న ఒక బంకుదగ్గర నిలబడ్డాడు సూర్యం. విశ్వనాథం కనిపించాడు. అతడై మాట్లాడేంతవరకుగానీ అతన్ని గుర్తించ లేదు తాను. అతడూ మూలుగుతున్నాడు. ఎండిన గుండెపైకీ కిందికీ ఆడు తోంది ... అతడప్పుడప్పుడూ అనారోగ్యంతో బాధపడడం కద్దు.

"ఏంటోయ్ సూర్యం." అన్నాడు విశ్వనాథం.

సూర్యం వాలిపోతున్న తలను విధిలేక పైకెత్తి— "ఏం ఒళ్లు బాగాలేదా?" అన్నాడు చటుక్కున.

దానికి సమాధానమివ్వక విశ్వనాథం- "ఇకనైనా యివ్వరాదా డబ్బు?" అన్నాడు క్షీణస్వరంతో.

ఏమీ చెప్పలేని స్థితిలో-"ఇస్తాను విశ్వనాథం..." అంటూ నీళ్ళు నమిలాడు సూర్యం.

"ఇంకా ఎప్పుడు? పోనీ, కొద్దిగానైనా యివ్వ రాదూ?" కొంతసేపు-యిద్దరూ ముఖాముఖాలు చూసు కుంటూ మౌనంగా నిలబడ్డ తర్వాత-విశ్వనాథం ఏమీ చెప్ప కుండా తూలుతూ చిన్నగా నడిచిపోయాడు.

అతడు పోతూ పోతూ విరక్తిగా-'హుఁ' అనుకోవడం సూర్యానికి వినిపించింది.

ప్రాణవాయువులు ఎగిరిపోవడానికి ముందు విశ్వనాథం అనుభవించిన బాధనంతా వూహించుకొని హడలిపోయాడు మూర్యం. అతడు విరక్తిగా 'హుం' అనుకోడంలో-సమాజం పట్ల ఎంతటి ఏహ్యాభావం అతని హృదయాంతరాళంలో కరడుగట్టుకున్నదో సూర్యానికి అర్థమైంది.

బ్రతికి చెడ్డవాడు విశ్వనాథం. అసువులకన్నా ఆత్మా భిమానం గొప్పదతనికి. తన దైన్యస్థితిని బయటపెట్టుకోడు. కడుపుమాడి ప్రాణం కడంటిపోతూన్నా నోరుతెరచి ఒకరితో చెప్పుకోలేడు. తనకు రావలసిన డబ్బుకోసం చేయిచాచి, లేదనిపించుకుంటాడు.

విశ్వనాథం ఎవ్వరినీ ఒకఅణా యిమ్మని అడిగి వుండడు. నీరసించిపోయిన అతని తనువు మొండిగోడల వెనుక చీకటిలో సొమ్మసిల్లి పడివుంటుంది. ఆకలిమంటకు పేగులే జీర్ణమైపోయి వుంటాయి. జ్ఞానేంద్రియాలన్నీ స్మృతి కోల్పోయి వుంటాయి. అతని ప్రాణం-ముక్కూ నోరూ కట్టి వేయబడిన మనిషిలా తన్నుకులాడి వుంటుంది.

విశ్వనాథం చాలమందిని క్షుద్బాధనుంచి రక్షించాడు. పొట్టేలుకూర వేపుడు, మేకపోతు మెదడు, కోడి పలావు-మొదలైన వాటితో ఎందరికో విందుభోజనాలు కుడిపించాడు. తన జీవితకాలంలో అతను పొందిన ప్రతిఫలమేమీ లేదు. అతనిచేతి అన్నమే అవసానంలో అతన్ని చిన్నచూపు చూసింది.

దానాల్లో కంతా అన్నదానం గొప్పదంటారు బుధులు.

అన్నదానంవల్ల ఐహికాముష్మికాలు సిద్ధిస్తాయని కూడా అంటారు.

విశ్వనాథానికి-ఈ లోకంలో అసువులు నిల్పుకోడానికి కవళమన్నమైనా యివ్వలేని ఆదానశీలత-ఆతనిని పరలోకంలోనైనా రక్షిస్తుందా!

★★